## యాడికిలో స్వచ్ఛ పథం




యాడికి, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని పురస్కరించుకుని డిప్యూటీ ఎంపీడీవో శశికళ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సంబంధిత సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొని గ్రామ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో శశికళ మాట్లాడుతూ పరిశుభ్రత మనందరి బాధ్యత. ఆరోగ్యకరమైన గ్రామ నిర్మాణమే మన లక్ష్యం. అందరం కలిసి స్వచ్ఛమైన వాతావరణం కోసం కృషి చేయాలి అని తెలిపారు. ర్యాలీ సందర్భంగా ప్రజలకు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టల్లో వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వీణ, జయలలిత, జ్యోతిర్మయి, ఇంద్రజ మరియు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది హేమాద్రి, పంచాయతీ సిబ్బంది రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## చుక్కలూరు పీహెచ్‌సీ ల్యాబ్ తనిఖీ



యాడికి, ఏప్రిల్ 29 (అనంత ప్రభ )

జిల్లా మలేరియా అధికారి డి ఓబుల్ ఆదేశాల మేరకు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పరిశీలించారు. మెడికల్ డాక్టర్లు లావణ్య, కీర్తి ఆధ్వర్యంలో రక్తపూత స్లైడ్ల పరిశీలన, మైక్రోస్కోప్ పనితీరు, స్టాక్ రిజిస్టర్, ఎంఎఫ్–2, ఎంఎఫ్–7, ఎంఎఫ్–8 రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ల్యాబ్ టెక్నీషియన్ నాగజ్యోతికి సూచించారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్వైజర్ ఎంపీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానము



యాడికి, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాడికి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు శ్రీరామిరెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు బాల నారాయణరెడ్డి, అమర్నాథ్ రెడ్డి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు సేవాభావంతో అన్నదానం నిర్వహించిన శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు

## జాతీయ స్థాయి అవార్డు అందుకున్న హరి నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరికృష్ణ



ఆదోని, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

కర్నూలు నగరంలోని టి.జి కళాక్షేత్రంలో బి.ఇ.ఎన్.డి.ఎస్.ఆర్.కె.ఎల్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రతిభావంతులకు జాతీయ స్థాయి పురస్కారాలను ప్రదానం చేశారు. ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన హరి నవోదయ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ హరికృష్ణకు ప్రజాసేవలో చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించింది. డీఎస్పీ మహబూబ్ బాషా, కళాతపస్వి పత్తి ఓబులయ్య చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హోని ఫౌండేషన్ చైర్మన్ హోనివర్ష రెడ్డి, సినిమా డైరెక్టర్ మౌలాలి భాషతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన బైక్ మాయం -- రికవరీలో నిర్లక్ష్యం ఆరోపణలు విచారణకు నూర్ అహ్మద్ ఫిర్యాదు



ఆదోని, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

ఆదోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో జప్తు చేయబడిన బైక్ మాయమైన ఘటనపై అప్పటి సీఐ శ్రీరాం చట్టం ప్రకారం వ్యవహరించలేదని ఆరోపిస్తూ విచారణ జరపాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర డీజీపీ, కర్నూలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పోలీస్ స్టేషన్‌లో జప్తు చేసి సంరక్షణలో ఉంచిన ఒక పౌరుని బైక్ మాయం కావడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం అని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కోర్టులో నిజానిజాలు తేల్చాల్సిన సీఐ శ్రీరాం, చట్టపరమైన విధానాలను పాటించకుండా స్వయంగా బాధితునికి డబ్బు చెల్లించారనే వార్తలు వెలువడటం దిగ్భ్రాంతికరమని అన్నారు.

ఇలాంటి చర్యలు పోలీసులపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని, కాబట్టి ఎస్పీ స్థాయి అధికారితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. చట్టబద్ధంగా వ్యవహరించకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రజలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని నూర్ అహ్మద్ కోరారు.

ఈ అంశానికి సంబంధించిన వివరాలను తమ వద్ద ఉన్న సమాచారంతో ప్రభుత్వానికి ఇప్పటికే అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆలూరు నూర్ అహ్మద్ రాష్ట్ర కార్యదర్శి,

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి,

## హాలహర్వి గ్రామంలో నూతన వధూవరులకు అంబేద్కర్ చిత్రపట బహూకరణ



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలంలోని మిట్టసోమాపురం గ్రామానికి చెందిన జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అనిల్ చెల్లెలు హైమావతి -- విజయ్ వివాహం హోలహర్వి గ్రామంలో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో కులమత భేదాలు లేకుండా ప్రతి ఇంటిలో దేవుళ్ల ఫోటోలతో పాటు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని కూడా ప్రతిష్ఠించాలనే లక్ష్యంతో జై భీమ్ ఎమ్మార్పీఎస్ సంఘం పనిచేస్తోందని తెలిపారు.

సంఘం స్థాపన నుంచి ఇప్పటి వరకు మొత్తం 2401 అంబేద్కర్ చిత్రపటాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్, టిడిపి ఎస్సీ సెల్ ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు మద్రి దావీదు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గందాలం మణికుమార్, నందవరం మండల ఇన్చార్జి చింపిరి చిన్నపోతప్ప, ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శావల సత్యానందం, నందవరం మండల ప్రధాన కార్యదర్శి శవల శాంతిరాజు, గోనేగండ్ల మండల ఇన్చార్జి తగరం రాజేష్, వీ.తిమ్మాపురం చెందిన చిక్కం యోహాను తదితరులు పాల్గొన్నారు

## పార్టీ బలోపేతానికి కార్యాచరణపై దృష్టి అనుబంధ విభాగాల నాయకులతో త్వరలో సమీక్ష సమావేశం



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తూ మాజీ ఎంపీ , నియోజకవర్గ సమన్వయకర్త డా. తలారి రంగయ్య అధ్యక్షతన నియోజకవర్గం లోని వెస్ట్ కోడిపల్లి గ్రామం లో వైస్సార్సీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, జిల్లా మరియు నియోజకవర్గ స్థాయి అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చలు జరిగాయి. ముఖ్యంగా ప్రజా సమస్యలను సమగ్రంగా గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ తరఫున చేపట్టాల్సిన చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం, గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. పార్టీ బలోపేతానికి అనుబంధ విభాగాల పాత్ర కీలకమని, ప్రతి స్థాయిలో నాయకులు సమిష్టిగా పని చేయాలని సూచించారు.

రాబోయే కార్యక్రమాల అమలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తూ డా. తలారి రంగయ్య మార్గనిర్దేశం చేశారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీటీసీ నరసింహులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయాలలో డా. తలారి రంగయ్య గారు, ఒక ప్రతేకమైన ముద్ర వేశారని, అయన నాయకత్వం లో పని చేయడానికి పార్టీ నాయకులు కార్యకర్తలు, ఎంతో ఉత్సహంగా ఉన్నారు అని తెలియజేశారు.

వెస్ట్ కోడిపల్లి గ్రామంలో ఎంపీటీసీ నరసింహులు మరియు, వైసిపి నాయకులు మోహన్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయా కర్త, డా. తలారి రంగయ్య కు చిన్న ఆత్మీయ సత్కారం చేశారు

## తెలియని పరిచయం తెలియని ప్రమాదానికి నాంది కావొచ్చు

యాడికి, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన హనీ ట్రాప్ ఘటన సమాజాన్ని కలవరపెట్టిన కొన్ని రోజులకే, సోషల్ మీడియా పరిచయాలు ఎంత ప్రమాదకరంగా మారవచ్చో మరోసారి స్పష్టమైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో మొదలైన పరిచయం చివరకు ఒక యువకుడిని గుత్తి సమీపంలో దోపిడీ గ్యాంగ్ వలలోకి నెట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన యువతకు గట్టి హెచ్చరికగా నిలుస్తోంది. సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే అపరిచితులను తొందరగా నమ్మి, ఒంటరిగా కలవడానికి వెళ్లడం తీవ్ర ప్రమాదాలకు దారితీయొచ్చు. పరిచయం ఎంత నమ్మకంగా అనిపించినా, దాని వెనుక ఉన్న వ్యక్తుల అసలు స్వరూపం తెలియకపోవచ్చు.

ప్రస్తుతం హనీ ట్రాపులు, డేటింగ్ యాప్ మోసాలు, వీడియో కాల్ బ్లాక్‌మెయిల్ ఘటనలు పెరుగుతున్నాయి. యువతను లక్ష్యంగా చేసుకుని గ్యాంగులు పన్నే వలలో చాలామంది చిక్కుకుంటున్నారు. అజాగ్రత్త, అతినమ్మకం, భావోద్వేగ నిర్ణయాలే ఇటువంటి నేరాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఇలాంటి ప్రమాదాల నుంచి దూరంగా ఉండాలంటే అప్రమత్తత చాలా అవసరం. అపరిచితులతో కలవాల్సి వచ్చినా పబ్లిక్ ప్రదేశాలనే ఎంచుకోవాలి. వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, బ్యాంక్ సమాచారం పంచుకోవడంలో జాగ్రత్త వహించాలి. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే అక్కడి నుంచి దూరంగా వెళ్లి పోలీసులను సంప్రదించాలి. సోషల్ మీడియా మన జీవితంలో భాగమైనప్పటికీ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది. ప్రతి యువకుడు, యువతి జాగ్రత్తగా వ్యవహరించాలి. తెలియని పరిచయం తెలియని ప్రమాదానికి నాంది కావొచ్చు. అప్రమత్తంగా ఉండాలి

## బిసి కార్పొరేషన్ ఈడిగా బాధ్యతలు స్వీకరించిన డి.సుబ్రమణ్యం..



అనంతపురం, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

అనంతపురం నగరంలోని బిసి కార్పొరేషన్ ఈడి కార్యాలయంలో బుధవారం బిసి కార్పొరేషన్ ఈడిగా డి.సుబ్రమణ్యం బాధ్యతలు స్వీకరించడం జరిగింది. బిసి కార్పొరేషన్ ఈడి (ఎఫ్.ఏ.సి) రామసుబ్బారెడ్డి నుంచి బిసి కార్పొరేషన్ ఈడిగా డి.సుబ్రమణ్యం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈడి డి.సుబ్రమణ్యంకి బిసి కార్పొరేషన్ ఈడి కార్యాలయం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## అనంతపురం మున్సిపల్ కమిషనర్ యశ్వంతరావుని మర్యాదపూర్వకంగా కలిసిన బాంసెఫ్ మరియు బహుజన సమాజ్ పార్టీ నాయకులు



అనంతపురం, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

అనంతపురం మునిసిపల్ కార్యాలయం నందు నగరంలోని అనేక ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ముఖ్యంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, మెప్మా ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి మరియు అనేక సంక్షేమ పథకాలను గూర్చి చర్చించగా సానుకూలంగా స్పందించి, మున్సిపాలిటీకి సంబంధించి ఏ విషయమైన నా దృష్టికి తీసుకువచ్చిన శక్తివంచన లేకుండా పరిష్కరిస్తానని చెప్పడం జరిగింది. కమిషనర్ గారిని కలిసిన వారిలో బాంసెఫ్ నాయకులు రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎన్ రంగస్వామి గారు, రిటైర్డ్ హెడ్మాస్టర్ అంజయ్య గారు, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు రాయలసీమ జోన్ ఇంచార్జ్ గద్దల నాగభూషణం గారు, అనంతపురం జిల్లా ఇన్చార్జ్ బైనేని శ్రీనివాసరాజు గారు, అనంతపురం నియోజకవర్గ కన్వీనర్ కంచె గోపాల్ గారు తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తెదేపా నాయకులు



కూడేరు, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

కూడేరు మండల కేంద్రంలోని శ్రీ సంగమేశ్వర దేవాలయం నందు బుధవారం రోజున అరవకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బట్టి చిన్న సంగప్ప కూతురు నాగప్రియ వివాహానికి హాజరై నూతన వధూవరులు ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మురళి,టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుండా శివయ్య.. టీడీపీ మండల నాయకులు పుట్టా.నరేష్, గ్రామ నాయకులు బండి అంజి, బంది సంగప్ప,వారదప్ప,చిన్న నరసింహులు,బట్టి కదిరప్ప,బట్టి పెద్ద సంగప్ప, సూరి, శేఖర్, వెంకటేష్, అశోక్,పెద్దన్న,తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహ వేడుక హాజరైన మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి



ఉరవకొండ, ఏప్రిల్ 29 (అనంత ప్రభ)

ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వైసిపి పార్టీ సమన్వయకర్త వై. విశ్వేశ్వర రెడ్డి, కె.వి రమణ నియోజకవర్గంలోని చిన్న ముస్తూరు, రామసాగరం, ప్యాపితండా, కమ్మూరు గ్రామాలలోని బుధవారం రోజు పలు వివాహ వేడుకల కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు

## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం-రాహత్' ద్వారా నగదు రహిత చికిత్స్



పుట్టపర్తి, ఏప్రిల్ 28 (అనంత ప్రభ )

కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం 'పీఎం–రాహత్' పథకానికి సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే ఉచితంగా, నగదు రహిత చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ప్రమాదం జరిగిన మొదటి 24 గంటల లోపు ఆసుపత్రిలో చేరిన వారికి అత్యవసర వైద్య సేవలు అందుతాయి. ఈ పథకం కింద ఒక వ్యక్తికి గరిష్టంగా 1.5 లక్షల రూపాయల వరకు అత్యవసర చికిత్స కవర్ అవుతుంది. ఒకవేళ చికిత్స ఖర్చు 1.5 లక్షలు దాటితే, మిగిలిన మొత్తాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా వర్తింపజేస్తామని వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి వివరించారు. ఈ కార్యక్రమములో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఆర్డీఓ కరుణసాగర్,ఎన్టీఆర్వైద్య ఆరోగ్య సేవ సమన్వయకర్త శ్రీ దేవి,డిసిహెచ్ఎస్ మధుసూదన్,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సునీల్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొని